# మాలూమ్ నై సాంబ్!

-జి.చెంచుమోహన్‌నాయుడు

కొత్తగా ఎమ్మెల్యేలైన రంగారావు, సుబ్బారావు, అప్పారావు మిత్రత్రయం. అక్కడ జరుగుతున్న వాళ్ల పార్టీ ఎమ్మెల్యేల మీటింగ్‌లో వాళ్ళు ముగ్గురూ ఖద్దరుగుడ్డలు ధరించి, హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

కనబడిన ప్రతివాడికీ నమస్కారం పెడుతూ, వాళ్ళు తిరిగి ప్రతి నమస్కారం చేస్తే "అహ చూడరా మన పవరు!" అనుకుంటూ మురిసిపోతున్నారు.

పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్లుగా ఉంటూ గ్రామస్థాయిలో కాకపోతే మండలస్థాయిలో రాజకీయాలు వెలగబెడుతున్న ఈ మిత్రత్రయం ఎమ్మెల్యేలయ్యారంటే ఆశ్చర్యంగా లేదూ?

వీళ్ళు ఎమ్మెల్యేలుగా గెలిచారంటే వీళ్ళు పోటీ చేసిన నియోజకవర్గాలలో ఎవరూ నమ్మలేదు.

ఎవరిదాకానో ఎందుకు, ముందు వీళ్లకే నమ్మకం కలగలేదు. కలేమో అనుకున్నారు. గిల్లి చూసుకున్నారు. గిచ్చి చూసుకున్నారు. నొప్పి పుట్టేసరికి కలకాదు నిజం అని నమ్మాల్సి వచ్చింది. మరి ఎలాగయ్యారంటారా..

ప్రస్తుత రాజకీయాల్లో సినీగ్లామర్‌కు ప్రాధాన్యత తగ్గిపోయింది కదా.

మొన్న తమిళనాడులో జరిగిన ఎన్నికలలోనూ, అంతకు ముందు మన రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలోనూ సినీగ్లామర్ పెద్దగా పనిచేయలేదని ఋజువయింది కదా.

అందుకేనేమో ఇప్పుడు మన రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వేళ, ప్రముఖ సినిమా హీరో ప్రాంతీయపార్టీ పెట్టినా టిక్కెట్లకై ఎవరూ పెద్దగా ఎగబడలేదు.

ప్రధాన రాజకీయపార్టీల చుట్టూనే తిరుగుతున్నారు గానీ సినిమా హీరో పార్టీ వైపు చూడలేదు. దీనితో సినిమా హీరో పార్టీ తరఫున 294 నియోజకవర్గాలన్నింటిలో పోటీ చేసేందుకు అభ్యర్థులే కరువయ్యారు.

అదిగో...సరిగ్గా అలాంటి పరిస్థితిలోనే పంచాయితీ ప్రెసిడెంట్‌లుగా ఉన్న ఈ మిత్రత్రయానికి కులం ప్రాతిపదికపై టిక్కెట్ ఇచ్చి పోటీలో నిలబెట్టారు.

వీళ్ల అదృష్టమో, వీళ్ల పార్టీ నాయకుడైన సినిమా హీరో అదృష్టమో బాగుండి అందరి అంచనాలనూ, ఎగ్జిట్‌పోల్స్‌నూ, జ్యోతిష్కుల జోస్యాలను తలక్రిందులు చేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం వరించింది.

ఇంతవరకూ వీళ్ళు హైదరాబాద్ ముఖం కూడా చూసి ఎరుగరు.

ఇంతకంటే విచిత్రం, విడ్డూరం మరొకటుందా?

తంతే గారెలబుట్టలో పడ్డట్టు వీళ్లను పంచాయితీ ఆఫీస్‌లో తంతే వచ్చి అసెంబ్లీలో పడ్డారు. సుడి అంటే అట్లా ఉండాలి మరి.

మీటింగ్ ముగిసింది. షరామామూలుగా పార్టీ నాయకుడైన సినిమా హీరోని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు.

తెల్లవారి ఎల్‌బి.స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించారు.

మిత్రత్రయానికి టిక్కెట్లు ఇప్పించి ఎన్నికల్లో పోటీచేయించిన వాళ్ల జిల్లా నాయకుడు కనిపించి "ఏమయ్యా ఎమ్మెల్యేలూ టైం పదకొండే అయ్యింది. సాయంత్రం దాకా ఏం చేస్తారు? హోటల్లోనే ఉంటారా లేక అలా సిటీ తిరిగొస్తారా?" అడిగాడు.

"నిన్నటి నుంచీ హోటల్‌లోనే ఉండీ ఉండీ బోర్ కొడతా ఉంది సిటీ తిరిగొస్తాం" అన్నారు ముగ్గురూ.

"అయితే రండి మీకు కారు ఏర్పాటుచేస్తాను" అంటూ ముగ్గుర్నీ బయటకు తీసుకెళ్లి ఒక కారులో ఎక్కించాడు.

"ఇది మా అల్లుడి కారేలే. ఆయన కూడా ఊళ్ళోలేడు. సాయంత్రం దాకా మీ ఇష్టం వచ్చినట్లు తిరగండి" అని వీళ్లకు చెప్పి "ఇదిగో డ్రైవరూ వీళ్ళు ముగ్గుర్నీ హైదరాబాద్‌లో చూడవలసిన వన్నీ చూపించి సాయంత్రానికి వైస్రాయ్ హోటల్ దగ్గర దించెయ్" అని డ్రైవర్‌కు చెప్పాడు.

"జీ సాబ్!" అన్నాడు డ్రైవర్.

అతడు ముస్లిం కుర్రాడు. తెలుగు పెద్దగా వచ్చినట్లు లేదు.

డ్రైవర్ ముందుగా కారును చార్మినార్ దగ్గరకు తీసుకువెళ్లాడు. కారులో నుండి దిగిన ముగ్గురూ, చార్మినార్‌ను ముందు క్రిందనుండి చూసి, ఆపై మెట్లెక్కి పైకెళ్ళి నాలుగువైపులా కలియ తిరిగి చూశారు.

"అబ్బబ్బబ్బ! ఏం కట్టినారులే. నట్టనడూర్లో ఇంత పెద్ద మిద్దె ఎన్నిరోజులు కట్టినారో, ఎంత ఖర్చయిందో" అంటూ కట్టినవాడినీ, కట్టించినవాడినీ తెగ మెచ్చుకుంటూ క్రిందికి దిగివచ్చారు. కారెక్కగానే బయలుదేరింది.

"ఇదిగో అప్పారావ్! ఇప్పుడు మనం చూసిన చార్మినారో గిర్మినారో ఏందది, దాన్నెవడు కట్టించి ఉంటాడంటావ్?" అన్నాడు రంగారావు.

"ఏమో రంగారావ్! నాకు మాత్రం ఏం తెలుసు. మనమేమన్నా ఈ ఊరోళ్లమా. మనూర్లో రామాలయం కట్టించిందెవరంటే కోమటి కిష్టయ్య అని ఠక్కున చెప్పొచ్చు. ఊరబావి తవ్వించినోడెవడంటే గోశెట్టి చెంచయ్య అని ఠక్కున చెప్పొచ్చు. ఎందుకంటే అది మనూరు కాబట్టి. మరి ఈ ఊళ్ళో

సంగతులు మనకేం తెలుస్తయ్'' అన్నాడు అప్పారావు.

"ఇంతెందుకబ్బా! డ్రైవర్ ఈ ఊరివాడే అయ్యుంటాడు. అతన్నడిగితే పోలా'' సలహా ఇచ్చాడు సుబ్బారావు.

"అద్దీ ఐడియా..'' అంటూ రంగారావు "ఇదిగో డ్రైవర్‌బాబూ! ఇప్పుడు మేం ఎక్కి చూసిన చార్మినార్‌ను కట్టించినోడెవడో నీకు తెలుసునా?'' డ్రైవర్‌ని అడిగాడు.

కారు నడుపుకుని బ్రతికే అతనికేం తెలుసు ఈ చరిత్రలు.

అందుకే "మా లూమ్ నై సాబ్'' అన్నాడు ఉర్దూలో తనకు తెలియదు అన్నట్లుగా.

"ఓహో! మాలూమ్ నై సాబ్ కట్టించాడా! నేననుకున్నాన్లే ఎవరైనా నవాబులే కట్టించి ఉంటారని''



అన్నాడు అప్పారావు.

"ఎలా అనుకున్నావబ్బా?'' ప్రశ్నించాడు సుబ్బారావు.

"పూర్వం హైదరాబాద్‌ని ఏలింది నవాబులే కదయ్యా. చిన్నప్పుడు పుస్తకాల్లో చదువుకోలా'' బదులిచ్చాడు అప్పారావు.

ఇలా వీళ్ళు మాట్లాడుకుంటూండగా కారు సాలార్‌జంగ్ మ్యూజియం వద్దకు చేరింది.

ముగ్గురూ కారు దిగి మ్యూజియంలోని కెళ్లి అక్కడ ఉంచిన రకరకాల కత్తులు, కటార్లు, బొమ్మలు, కుర్చీలు, తుపాకులు, పాలరాతిబొమ్మ మరియు చిలక కొట్టే గంట గడియారం మొదలైనవన్నీ చూసి మెచ్చుకుంటూ బయటికొచ్చి కారెక్కారు.

వీళ్లెక్కగానే బయలుదేరింది.

"అబ్బ! దీన్ని కట్టించినోడెవడో గానీ గొప్పోడురా. ఆ పాలరాతి బొమ్మను చూశారా. నిజంగా మనిషున్నట్లే ఉంది. ఒకటేమిటి దాన్లో ఉన్న వస్తువులన్నీ చూడదగినవే" అలా పొగుడుతూ అసలు దీన్ని కట్టించిందెవరో తెలుసుకోక పోతిమే అనుకుంటూ డ్రైవర్‌ని అడిగారు.

"బాబూ! దీన్ని కట్టించిందెవరు?" అని.

"మా లూమ్ నై సాబ్" అన్నాడు మళ్లీ.

"ఓర్నీ....దీన్ని కట్టించింది కూడా మా లూమ్ నై సాబేనా. మహానుభావుడురా" అన్నాడు సుబ్బారావు.

"అవున్నిజమే" వంతపాడారు మిగిలిన ఇద్దరూ.


కారు జూపార్కు దగ్గరకొచ్చి ఆగింది. కారు దిగి ముగ్గురూ జూపార్కులో నికెళ్లారు.

అక్కడ రకరకాల జంతువులను, పక్షులను, పాములను చూసి తెగ సంబరపడిపోయారు.



## త్రిషానందం

తెలుగులో టాప్ హీరోయిన్‌గా సంచలనాలు సృష్టించిన త్రిష ఇప్పుడు నందమూరి బాలకృష్ణతో ఓ సినిమాలో నటించబోతోంది. నిర్మాణంలో వున్న 'స్టాలిన్'లో మెగాస్టార్ చిరంజీవితో నటిస్తున్న త్రిష ఇప్పుడు బాలకృష్ణకి జంటగా నటించడానికి ఎన్నిక కావడం ఈ కాంబినేషన్‌కి మరింత క్రేజ్‌ని తీసుకొస్తుందని వేరే చెప్పనవసరం లేదు. బాలకృష్ణ-త్రిష జంటగా నటించబోయే ఆ సినిమాకి బి.గోపాల్ దర్శకుడు.




పార్కులో తిరిగే మినీ రైలెక్కి తిరిగారు. అక్కడే ఉన్న ఏనుగుపైకి కాసేపు అటూ ఇటూ ఊరేగారు.

మొత్తానికి చిన్నపిల్లల్లా మహదానందంతో పార్కు బయటికొచ్చి కారెక్కారు.

వీళ్లకోసమే కాచుక్కూర్చుని ఉన్న డ్రైవర్ వెంటనే కారు బయలుదేరదీశాడు.

కార్లో కూర్చున్న ముగ్గురూ పార్కునూ, అందులో చూసిన జంతువులు, పిట్టలు, పాములను గుర్తుకుతెచ్చుకుంటూ హుషారుగా ఉన్నారు.

అరెరెరె...ఈ పార్కుని ఏర్పాటుచేసిందెవరో కనుక్కోలేకపోతిమే అంటూ "ఇదిగో డ్రైవర్‌బాబూ! ఈ పార్కుని కట్టించిందెవరయ్యా?" అన్నారు.

అతను యథాప్రకారం "మాలూమ్ నై సాబ్" అన్నాడు.

"ఓర్నీ ఎంకమ్మా.. ఈ మాలూమ్ నై సాబ్ ఎవడోగానీ సగం హైదరాబాదుని ఈయనే కట్టిచ్చినట్టున్నాడే" అన్నాడు రంగారావు.

ఇంతలో కారు బిర్లామందిర్‌కి చేరింది.

కారు దిగిన ముగ్గురూ, కాళ్ళుకడుక్కుని గుడిలోకెళ్ళి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని వచ్చారు.

"అబ్బ! ఏం గుడిరా. ఎంత బాగా కట్టించారు. మొత్తం పాలరాయేనంట. ఎవడు కట్టించాడో గానీ వాడి కాళ్లకు మొక్కొచ్చు. తిరుపతిలోని వెంకన్న గుడి కూడా దీని ముందు దిగదుడుపే" అన్నాడు అప్పారావు.

"సరేలే పదండి. పొద్దుగూకొచ్చింది. పొద్దుట్నించీ తిరిగి తిరిగీ కాళ్ళు నొప్పులు పడుతున్నాయి. తొందరగా ఆ లాడ్జికెళ్ళి ఉడుకుడుకు నీళ్ళు ఒంటిపై గుమ్మరించుకుంటేగానీ ఈ బడలిక పోదు" అంటూ సుబ్బారావు మిగతా ఇద్దర్నీ కారెక్కించి ఇదిగో "డ్రైవర్ బాబూ! మేం తిరిగినకాడికి, నువ్వు తిప్పినకాడికీ చాలుగాని మమ్మల్ని హోటల్ దగ్గర దిగబెట్టవయ్యా" అన్నాడు.

"అసలు సంగతి మర్చిపోయాం. ఈ గుడిని కట్టించిందెవరో కనుక్కోకపోతిమి" అంటూ రంగారావు "బాబూ డ్రైవరూ! ఈ గుడిని కట్టించినాయన పేరు చెప్పు" అన్నాడు.

"మా లూమ్ నై సాబ్" అన్నాడతను.

"ఏమిటి? ఈ గుడిని కట్టించింది మా లూమ్ నై సాబ్? సాయుబు అయ్యుండి వెంకన్న గుడిని ఇంత అందంగా ఎంత డబ్బు పెట్టి కట్టించాడు" ఆశ్చర్యంగా అన్నాడు అప్పారావు.

"అదేందప్పారావ్ అలాగంటావ్! సాయుబులంటే ఎవరూ మన బంధువు లేనయ్యా. ఎలాగంటావా మన వెంకటేశ్వర స్వామి రెండో పెళ్లి చేసుకున్న బీబీ నాంచారమ్మ ఎవరు? సాయుబుల మనిషే కదూ.. ఆ రకంగా మనకు వాళ్ళు పాత చుట్టాలేనయ్యా" అన్నాడు సుబ్బారావు.

"మొత్తానికి ఈ మా లూమ్ నై సాబ్ ఎవరో గాని మంచి మంచివన్నీ కట్టించి మనుషుల్లో దేవుడయ్యాడు. బతికుంటే ఒకసారి వాళ్లింటికెళ్లి దండం పెట్టుకుని రావాలి" అంటూ రంగారావు చెబుతుండగా కారు ఆగింది.

ఏమిటా అని బయటకు చూడగా ట్రాఫిక్ ఆగిపోయి ఉంది.

ఎదురుగా ఏదో పెద్ద ఊరేగింపు వస్తూ కనిపించింది.

బారులు తీరినట్లు జనం...టపాసుల శబ్దాలు, పెద్దగా వాయిస్తూ డప్పులు, ఆ డప్పు శబ్దాలకు తగ్గట్లు కుర్రాళ్ళు వేసే చిందులు, వెనుక పూలతో అలంకరించిన లారీ.

ఆ లారీ మీద శవం ఇవన్నీ చూస్తే అది శవం ఊరేగింపులా అనిపించింది.

"ఎవరో పెద్ద పేరున్న పెద్ద మనిషే చచ్చిపోయినట్లుంది. లేకపోతే ఇంత మందీ మార్బలంతో కాటికి సాగనంపుతారా?" అన్నాడు రంగారావు.

"ఆ పెద్దాయనెవరో తెలుసుకోవాలి" అంటూ "ఇదిగో డ్రైవర్‌బాబూ! ఈ ఊరేగించే శవం ఎవరిదో నీకేమైనా తెలుసునా? ఎవరో గొప్ప మనిషిలాగానే ఉన్నాడే" డ్రైవర్‌ని అడిగాడు అప్పారావు.

హైదరాబాద్ మహానగరంలో రోజూ ఎంతోమంది ఛస్తుంటారు. కాటికి తీసుకుపోతుంటారు.

వాళ్ల వివరాలన్నీ ఎవరికి తెలుస్తాయ్ అందుకే "మా లూమ్ నై సాబ్" అన్నాడు.

"ఆ!" అంటూ ముగ్గురూ నోరెళ్ళబెట్టారు ఆశ్చర్యంగా.

"ఏమిటి? ఈ చనిపోయిన మహానుభావుడు మాలూమ్ నై సాబా? ఇప్పటిదాకా బతికే ఉన్నాడా? బతికే ఉంటాడు? ఇంతమంచి మంచి పనులు చేసిన మహనీయుడాయె. అరెరెరె! బతికుండగా చూడలేకపోయామే" అన్నాడు రంగారావు

"ఒరేయ్ అప్పారావు, సుబ్బారావు! పదండ్రా ఆ మహానుభావుడి శవాన్నయినా ఆఖరుసారి చూద్దాం" అంటూ ఇద్దర్నీ వెంటబెట్టుకుని కార్లోంచి దిగాడు.

"ఇదిగో డ్రైవరూ మేం మా లూమ్ నై సాబ్ గారి శవాన్ని చూసొస్తాం గాని కారుని కొంచెం పక్కనాపి ఉంచు" అంటూ హడావిడిగా ఊరేగింపులో కలిసిపోయారు.

వాళ్ళు కారు దిగి హడావిడిగా ఎక్కడికెళుతున్నారో వెళ్తూ వెళ్తూ తనకేం చెప్పారో అర్థంకాక జుట్టు పీక్కునే పనిలో పడ్డాడు డ్రైవర్.

ఊరేగింపులో నుండి దూసుకుంటూ వెళ్లిన ముగ్గురూ శవాన్ని ఉంచిన లారీని ఎక్కబోయారు.

లారీ పై నున్న శవం తాలూకు బంధువులు "ఎవరు మీరు? ఎందుకు లారీ ఎక్కుతున్నారు?" అనడిగాడు.

"మేమెవరమా? మేం ఎమ్మెల్యేలం" అన్నారు.

"ఎమ్మెల్యేలా? అయితే మాత్రం మా శవంతో మీకేంటి పని?"

"మాకేం పనిలేదయ్యా! మహానుభావుడు మాలూమ్ నై సాబ్ గార్ని ఆఖరి చూపులైనా చూద్దామని. అంతే..."

"మా లూమ్ నై సాబా? ఆయనెవరు?"

"అదేనయ్యా! ఈ ఊళ్ళో చార్మినార్, మ్యూజియం, జూపార్కు ఇవన్నీ కట్టించాడే. ఆ మాలూమ్ నై సాబ్"

"వాటన్నింటినీ కట్టించింది మాలూమ్ నై సాబో కాదో మాకు తెలియదు గానీ ఈ చనిపోయినాయిన మాత్రం ఆయన కాదు. మా ముత్తాత నర్సింగ్ యాదవ్. పెద్ద పారిశ్రామిక వేత్త. నూటొక్కేండ్లు బ్రతికి ఈ దినమే పోయిండు. అందుకే జబర్దస్తుగా మా పెద్దాయన్ను సాగనంపుతున్నాం"

"కాదయ్యా! ఈ శవం మా లూమ్ నై సాబ్‌దని మా డ్రైవర్ చెబితే" అంటూ లారీని ఎక్కబోతుండగా ట్రాఫిక్ ఎందుకు ఆగిపోయిందో అర్థంకాని ఊరేగింపుకు ఎస్కార్టుగా ఉన్న ఎస్సై అక్కడకొచ్చాడు.

"అయ్యా ఎస్సైగారూ! వీళ్ళెవరో ఎమ్మెల్యేలం అంటున్నారు. ఈ శవం మా లూమ్ నై సాబ్‌దంటున్నారు. చార్మినార్, మ్యూజియం, జూపార్క్ కట్టించాడంటున్నారు. అసలు వీళ్ళెవరో, వీళ్ల సంగతేంటో కనుక్కోండి" అంటూ ఫిర్యాదు చేశారు శవం తాలూకు బంధువులు.

ఎస్సై వీళ్ల వైపు అనుమానంగా చూస్తూ "ఏమిటి? మీరు ఎమ్మెల్యేలా? నిజం చెప్పండి. అసలు మీరెవరు? ఆ మాలూమ్ నై సాబ్ ఎవరు? చార్మినార్ ఏంటి, మ్యూజియం ఏంటి? మీరు పాకిస్తాన్ ఉగ్రవాదులా? మీదే గ్రూపు. పదండి స్టేషన్‌కి. ముక్కెలు విరగదన్నితే మీరే చెబుతారు" అంటూ లారీ పైకెత్తాడు.

బిక్కచచ్చిపోయారు మిత్రత్రయం "బాబ్బాబూ ఎస్సైగారూ! మమ్మల్ని వదిలెయ్యండి. నిజంగానే మేం ఎమ్మెల్యేలం" అంటూ జరిగిందంతా పూసగుచ్చినట్లు వివరించారు.

అంత టెన్షన్‌లోనూ ఆ ఎస్సై నవ్వాపుకోలేక హ్హహ్హహ్హా.. అంటూ పగలబడి నవ్వాడు.

"మొత్తానికి భలేవాళ్లయ్యా మీరు. మా లూమ్ నై సాబ్ అంటే నాకు తెలియదు సార్ అని అర్థం. దాన్ని మీరు ముస్లిం పేరు అనుకుని ఇంతదూరం తెచ్చుకున్నారు. సరే జరిగిందేదో జరిగిపోయింది. ఇక మీరు జాగ్రత్తగా మీ కారు వెతుక్కుని ఎక్కి హోటల్‌కు వెళ్లండి" అంటూ ఆగిపోయిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యాడు.

"ఒరేయ్! ఇట్లాంటోళ్ళురా మన ఎమ్మెల్యేలు. మాలూమ్ నై సాబ్ అంటే అర్థంకాని వీళ్లంట మన రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళతారంట. ఏ ముందుకో మరి" ఎవడో జనంలోంచి అన్నాడు.

"అందుకేరా ప్రజా ప్రతినిధులుగా పోటీచేసేవారికి కనీస విద్యార్హత ఉండాలని మేధావులు చెప్పేది" అని ఇంకొకడన్నాడు.

ఈ మాటలు వింటూ బిక్కచచ్చిన మిత్రత్రయం చిన్నబోయిన ముఖాలతో కారును వెతుక్కునే పనిలో పడ్డారు.

★

## రాజుల పిచ్చిచేష్టలు

రాజుల సొమ్ము రాళ్లపాలు, రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా? అన్న సామెతలు నిజమైన వెర్రిమొర్రి రాజుల చరిత్రలు తిరగవేసి చూస్తే చాలా అతిసాధారణ సామెతలు అనిపిస్తాయి. అధికారమదంతో రాజులు, రాణులు చేసిన వెర్రిమొర్రి చేష్టలు ఈనాటికీ చరిత్రలో ఓ విచిత్ర వార్తలుగానే మిగిలిపోయాయి. రోమన్‌ను పాలించిన కలిగులా మహావీర శృంగార పిపాసి మాత్రమే కాదు. తల్లినీ, తండ్రినీ, ఇద్దరు సోదరుల్ని చంపిన పరమ కిరాతకుడు. 'నీరో' చక్రవర్తి కూడా తన తొలిభార్యను, తల్లిని కిరాతకంగా హతం చేసిన చరిత్ర హీనుడే. అందుకే రోమ్ చరిత్ర పుటల్లోంచి వీరికి సంబంధించిన సమాచారాన్ని తొలగించారు. తొలి ఫ్రెంచ్ మహారాజు క్లోవిస్-2 మానసికంగా ఎంత దౌర్బల్యం కలవాడంటే ఒక హంతకుని చేయి నరకినప్పుడు ఆ చేయిని చూసి భయోద్వేగాలతో పిచ్చివాడైపోయాడు. ఆ కారణంగా రాజుగా ఉండే అర్హతను కూడా కోల్పోయాడు.

## తొలి టెలివిజన్ ట్రాన్స్‌మిషన్

తొలి టెలివిజన్ ట్రాన్స్‌మిషన్ 1959 సెప్టెంబర్ 15న ప్రయోగాత్మకంగా ప్రారంభించబడింది. ఢిల్లీలో మురికివాడలలో నివసించే గుడిసెవాసులకు సాంఘిక విద్యను అందించే ప్రయత్నంలో భాగంగా ప్రసారం ప్రారంభమైంది. డాక్యుమెంటరీ ప్రసారాలతో మొదలై ప్రస్తుతం శాటిలైట్ ఛానెల్స్ వరకూ టెలివిజన్ ఎదగడం గొప్ప విశేషం.

-భూశ్యా

